సాక్షి నాగర్‌కర్నూల్

సోమవారం। 14 । ఏప్రిల్ । 2025

గరిష్టం/కనిష్టం
40.9 /21.2

వాతావరణం

ఉదయం, సాయంత్రం ఆకాశం స్వల్పంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉక్కపోత పెరుగుతుంది.

రేషన్ @ 65 శాతం



ఉమ్మడి జిల్లాలో వేగంగా సన్నబియ్యం పంపిణీ

- అన్నం వండుకోవడానికే ఆసక్తి చూపుతున్న లబ్ధిదారులు
- పలు రేషన్ షాపుల పరిధిలో నిర్ణీత కోటా మించి డిమాండ్
- అక్కడక్కడా కొంత మేర నూకలు.. ముద్దగా అన్నం
- దొడ్డు బియ్యంతో పోల్చితే పరవాలేదంటున్న వినియోగదారులు
- సరైన సమయంలో గంజి వార్చితే బాగుంటుందంటున్న మహిళలు

⇨ 'రేషన్ దుకాణాల్లో ఇదివరకు దొడ్డు బియ్యం ఇచ్చేవారు. అన్నం సరిగ్గా కాకపోయేది. వాటిని పిండి పట్టించి దోశలు ఇతర పిండి పదార్థాల తయారీకి ఉపయోగించేటోళ్లం. ఇప్పుడు సన్న బియ్యం ఇస్తున్నారు. కొంత మేర నూకలు ఉన్నాయి. అన్నం ముద్దగా అవుతోంది. అయినా దొడ్డు బియ్యంతో పోల్చితే నయమే కదా. ఈ సన్న బియ్యంతో అన్నమే వండుకుంటున్నాం. సరైన సమయంలో గంజి వార్చితే అన్నం పుల్లలు పుల్లలుగా ఉంటుంది.' అని రేషన్ లబ్ధిదారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

⇨ దొడ్డుబియ్యం పంపిణీ సమయంలో ఆసక్తి చూపని లబ్ధిదారులు, కిలో రూ.9, రూ.10 అంటూ బేరసారాలకు దిగే వారు.. సన్న బియ్యం వచ్చాయా.. తీసుకోవడానికి వస్తున్నాం అంటూ డీలర్లకు ఫోన్ చేసి మరీ చెబుతున్నారు... సర్కారు ఉగాది కానుకగా అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీపై ప్రజా స్పందనకు ఇవి అద్దం పడుతున్నాయి. లబ్ధిదారులు అన్నం వండుకుని తినేందుకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

గ్రౌండ్ రిపోర్ట్

ఇప్పటివరకు 12,521 మెట్రిక్ టన్నుల పంపిణీ..

ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల పరిధిలో 2,024 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 9,67,639 రేషన్ కార్డులు ఉండగా.. ఏప్రిల్ కోటాకు సంబంధించి రేషన్ దుకాణాలకు సుమారు 20,469 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 21,064 మెట్రిక్ టన్నులు సరఫరా కాగా.. రేషన్‌షాపుల ద్వారా లబ్ధిదారులకు శనివారం వరకు 12,521 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశారు.

నిర్ణీత కోటాకు మించి డిమాండ్..

ఉమ్మడి జిల్లాలో సుమారు 2.60 లక్షల మంది వలస కూలీలు ఉన్నారు. ఇందులో మెజార్టీ సంఖ్యలో ముంబై, పూణే వంటి ప్రాంతాల్లో కూలీలుగా పనిచేస్తున్నారు. వీరు కాకుండా హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో 80 వేల మంది వరకు భవన నిర్మాణ రంగంలో మేస్త్రీలు, అడ్డా కూలీలు, డైలీ కూలీలుగా బతుకీడుస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా సన్న బియ్యం పంపిణీ వాయిదా పడింది. అక్కడ దొడ్డు బియ్యమే పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాకు చెందిన వలస కూలీలు సొంత ప్రాంతాలకు వచ్చి రేషన్‌షాపుల్లో తమ కోటా సన్న బియ్యం తీసుకెళ్తున్నారు. దీంతో వనపర్తి జిల్లా అమరచింత, ఆత్మకూర్, మదనాపురం, కొత్తకోట, పెబ్బేరుతో పాటు మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్, మహమ్మదాబాద్, హన్వాడా, కోయిల్‌కొండ, మహబూబ్‌నగర్, దేవరకద్ర, నారాయణపేట జిల్లా కోస్గి, మద్దూర్, దౌల్తాబాద్ మండలాల పరిధిలోని పలు రేషన్ దుకాణాలకు నిర్ణీత కోటాకు మించి సరఫరా చేయాలని డీలర్లు కోరుతున్నారు. ఈ మేరకు అధికారులు రేషన్ కోటా పెంచేలా ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వనపర్తి జిల్లాలో ఇప్పటివరకే కోటాకు మించి 594.478 మెట్రిక్ టన్నుల బియ్యం అదనంగా పంపిణీ చేసినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

⇨ వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండలంలో మొత్తం 9,673 రేషన్ కార్డులు ఉన్నాయి. రేషన్ షాపులు 21 ఉండగా.. లబ్ధిదారులు 34,629 మంది ఉన్నారు. ఫిబ్రవరిలో చౌక దుకాణాలకు 203.929 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా అయ్యాయి. అదే ఏప్రిల్ నెలకు సంబంధించి ఇప్పటివరకు సుమారు నాలుగు మెట్రిక్ టన్నులు అధికంగా సరఫరా చేశారు. వలస కూలీలు వచ్చి సన్నబియ్యం తీసుకెళ్లడంతో కోటాకు మించి అధికంగా కావాల్సి వచ్చినట్లు డీలర్లు చెబుతున్నారు.

అవసరమైతే గడువు పెంపు..

ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల పరిధిలో శనివారం నాటికి 65 శాతం మంది లబ్ధిదారులకు సన్నబియ్యం సరఫరా చేశారు. మరో మూడు రోజుల్లో పంపిణీ పూర్తి చేసేలా అధికారులు ముందుకు సాగుతున్నారు. ఈ మేరకు వేగం పెంచాలని డీలర్లను ఆదేశించారు. నిర్దేశిత గడువు ముగిసిన తర్వాత ఇంకా ఎవరైనా లబ్ధిదారులు మిగిలి ఉన్నట్లయితే.. వారికి ఈ నెల 20వ తేదీ వరకు గడువు పెంచి అందజేయనున్నట్లు సివిల్ సప్లయ్ అధికారులు చెబుతున్నారు.



నాగర్‌కర్నూల్ మండలం మల్కాపూర్‌లో రేషన్‌బియ్యం పంపిణీ

జిల్లాల వారీగా సన్న బియ్యం పంపిణీ వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)..

జిల్లా	రే.షా	రే.కా	ఏప్రిల్ కోటా	రే.షా.ప.అ	ల.ప.అ
మహబూబ్‌నగర్	506	2,53,229	5,228.000	5,129.000	3,471
జోగులాంబ గద్వాల	335	1,63,693	3,591.429	3,591.428	2,500
నారాయణపేట	301	1,44,472	3,382.916	3,382.916	1,745
నాగర్‌కర్నూల్	558	2,43,107	4,946.455	4,500.000	2,813
వనపర్తి	324	1,63,138	3,321.066	4,461.000	1,992
మొత్తం	2,024	9,67,639	20,469.866	21,064.344	12,521

రే.షా: రేషన్‌షాపులు, రే.కా: రేషన్‌కార్డులు, రే.షా.ప.అ: రేషన్‌షాపులకు పంపిణీ అయింది, ల.ప.అ: లబ్ధిదారులకు పంపిణీ అయింది

సన్నవి ఇస్తుండడంతో ఊరికొచ్చి తీసుకున్నాం..



నా భార్య, పిల్లలతో సహా 15 ఏళ్లుగా హైదరాబాదులో నివాసం ఉంటున్నాం. మేం మొత్తం ఐదుగురం. ప్రతి నెల 35 కిలోల బియ్యం వస్తాయి. ఈ సారి సన్న బియ్యం ఇస్తున్న కారణంగా మా ఊరిలో తీసుకున్నాం. సన్న బియ్యంలో కొంత నూక ఉంది. అయినా బాగానే ఉన్నాయి. – స్వామి, వలస కూలీ, దుప్పల్లి, మదనాపురం, వనపర్తి

అన్నం బాగానే అయింది..



గతంలో వేసే లావు బియ్యం తినటానికి కొంచెం ఇబ్బందిగా ఉండేది. అయితే ప్రభుత్వం ఉచితంగా సన్న బియ్యం ఇస్తుండగా.. మొన్ననే తెచ్చుకున్నాం. అవే తింటున్నాం. అన్నం చాలా బాగా అయ్యింది. కాకపోతే కొత్త బియ్యం కావడంతో మెత్తగా అయింది. ఇదే బియ్యం బయట అంగట్లో కొంటే కిలో రూ.53 పలుకుతోంది. మా లాంటి పేదోళ్లు అంత ధర పెట్టి కొనలేం. – వెంకటేష్, నల్లకుంట, గద్వాల

నాణ్యతపై రాజీ పడొద్దు..



మేము కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాం. కుటుంబంలో నలుగురికి కలిపి వచ్చే 24 కేజీల రేషన్ బియ్యమే మాకు కడుపు నింపుతోంది. సన్నబియ్యం ఇవ్వడం సంతోషం. ఇప్పుడు వచ్చినవి వండుకుంటే అన్నం బాగానే అయింది. ప్రతి నెలా నాణ్యమైన బియ్యం పంపిణీ చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలి. ఎక్కడా రాజీ పడొద్దు. – కాసింబీ, గోప్లాపూర్, దేవరకద్ర, మహబూబ్‌నగర్

3 రోజుల్లోనే అయిపోయాయి..



రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేపట్టడంతో ఎప్పుడూ లేని విధంగా మూడు రోజుల్లోనే నా షాప్‌నకు వచ్చిన కోటా 171.33 క్వింటాళ్లు అయిపోయాయి. మిగతా రెండు షాపుల్లో కూడా మూడు రోజుల్లోనే బియ్యం సరఫరా జరిగిపోయింది. గతంలో బియ్యం పంపిణీకి 15 రోజులు పట్టేది. కోటా అయిపోయిన కూడా లబ్ధిదారులు వస్తున్నారు. అదనపు కోటా కోసం అధికారులకు తెలియజేశాం. – సంజీవరెడ్డి, డీలర్, రేషన్‌షాప్ నంబర్–3, మద్దూరు, నారాయణపేట

న్యూస్‌రీల్

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం



కల్వకుర్తి రూరల్: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వేపూరులో జై బాపు– జై భీమ్– జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడంతోపాటు మహాత్మగాంధీ చెప్పిన శాంతి సందేశాన్ని గడపగడపకూ తీసుకెళ్లారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి.. పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేసే విధంగా పాలన చేస్తున్నాయని విమర్శించారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వాని అన్నారు. దేశంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, ఎన్నికల హామీలను నెరవేర్చిన ఘనత తమదేనని చెప్పారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న బీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, శ్యాంసుందర్‌రావు, మల్లేష్, శ్రీధర్, వెంకటేశ్వరరావు, లింగమయ్య, పాండురంగారెడ్డి, బాలరాజు, వంశీ, రవి, యుగంధర్, వెంకటేష్, గణేష్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ రాజ్యాంగమే దేశానికి శ్రీరామ రక్ష

కందనూలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమే ఈ దేశానికి శ్రీరామ రక్ష అని, ఆ రాజ్యాంగాన్ని గౌరవిస్తూ దళితుల అభ్యున్నతి కోసం నిజాయితీగా బీజేపీ మాత్రమే పనిచేస్తుందని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి ఉయ్యాలవాడ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహాన్ని నీటితో శుద్ధి చేసి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో గంగిడి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ దేశవ్యాప్తంగా ఈ నెల 13 నుంచి 25 వరకు అంబేడ్కర్ జయంతి ఉత్సవాల పేరుతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని మారుస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కుట్రలను కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రత్యక్ష ఎన్నికల్లో అంబేడ్కర్‌కు పోటీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నిలబెట్టి కుట్రపూరితంగా ఆయనను ఓడించారని విమర్శించారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఉంచేందుకు కూడా కాంగ్రెస్ ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ సెమినార్లు, దళితవాడల్లో కార్నర్ మీటింగ్‌ల ద్వారా కాంగ్రెస్ ఇతర పార్టీలు చేసే తప్పుడు ప్రచారాలను ఎండగట్టి దళిత సామాజిక వర్గాల్లో చైతన్యం తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నేత పోతుగంటి భరత్‌ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుబ్బారెడ్డి, ఎస్సీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జలాల్ శివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్‌రెడ్డి, ఎస్సీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాగరాజు, నాగేంద్రగౌడ్, చందు, భీమేశ్వర్‌రెడ్డి, అభిలాష్‌రావు, రాము పాల్గొన్నారు.



వెళ్లొస్తాం.. లింగమయ్యా



- ముగిసిన సలేశ్వరం బ్రహ్మోత్సవాలు
- మూడురోజుల్లో లింగమయ్య దర్శించుకున్న 2 లక్షల మంది భక్తులు
- ఫర్హాబాద్ చెక్‌పోస్టులు మూసివేత

నల్లమలలోని లోతట్టు ప్రాంతం సలేశ్వర క్షేత్రంలో వెలసిన లింగమయ్య ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. మూడు రోజులపాటు నల్లమల కొండలు జనసంద్రంతో కిక్కిరిసి కనిపించాయి. చివరిరోజు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి వాహనాలు అడవిలోకి వెళ్లకుండా అటవీశాఖ నిలిపివేసింది. చివరిరోజు వస్తున్నాం.. లింగమయ్యా.. వెళ్లొస్తాం.. లింగమయ్యా అంటూ భక్తి పారవశ్యంలో మునిగితేలారు. – అచ్చంపేట

వివరాలు 8లో ▸

ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం



తెలకపల్లి మండలం దాసుపల్లి శివారులో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

జిల్లాలో 1.53 లక్షల ఎకరాల్లో వరిపంట సాగు

- ఊపందుకుంటున్న పంట కోతలు.. సేకరణకు చర్యలు
- రేపటిలోగా పూర్తిస్థాయిలో కేంద్రాల ఏర్పాటుకు కలెక్టర్ ఆదేశాలు
- గత సీజన్‌లో కొనుగోలు కేంద్రాలపై ఆసక్తి చూపని రైతులు
- అత్యధికంగా ప్రైవేట్ వ్యాపారులకే అమ్మకాలు

జిల్లాలో సాగైన వరి పంట 1,53,164 ఎకరాలు	దిగుబడి అంచనా 3,50,635 మె.ట.,
	ధాన్యం సేకరణ లక్ష్యం 2,87,297 మె.ట.,
ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాలు 234	ఏ-గ్రేడ్ ధాన్యం మద్దతు ధర రూ.2,320
సాధారణ రకం మద్దతు ధర రూ.2,300	సన్నాలు క్వింటాల్‌కు అందించే బోనస్ రూ.500

నాగర్‌కర్నూల్: జిల్లాలో ప్రతిఏటా వరిసాగు గణనీయంగా పెరుగుతోంది. అనుకున్న స్థాయిలో సాగు నీరు అందుబాటులో ఉండడం, కేఎల్ఐ నీటితో ఎప్పటికప్పుడు చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు నింపడం వల్ల వరిపంట సాగు చేసే రైతుల సంఖ్య కూడా ఏటా రెట్టింపు అవుతోంది. గత యాసంగి సీజన్‌తో పోలిస్తే ఈసారి వరి సాగు పెరగడమే ఇందుకు నిదర్శనం. ఈ క్రమంలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఏప్రిల్‌లో పంట చేతికి వచ్చే సమయం కావడంతో రైతులకు మద్దతు ధర కల్పిస్తూ వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం వరకు పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఇటీవల అధికారుల సమావేశంలో కలెక్టర్ ఆదేశించారు.

99 వేల మె.ట., మాత్రమే..

జిల్లాలో వానాకాలం సీజన్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలపై రైతులు పెద్దగా ఆసక్తి చూపకపోవడం, ప్రైవేటు వైపే మొగ్గు చూపడంతో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల లక్ష్యం నెరవేరలేదు. ఇది కాక జిల్లాలో సన్నరకాలపై రైతులు ఆసక్తి చూపడం, సన్న రకాలకు ప్రభుత్వం ఇచ్చే ధర, బోనస్ కలిపినా గిట్టుబాటు కాకపోవడంతో రైతులు ప్రైవేట్‌లోనే ఈ ధాన్యాన్ని అమ్ముకున్నారు. 250 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కేవలం 99 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. అయితే కొనుగోలు కేంద్రాల వద్ద సిబ్బంది అందుబాటులో లేకపోవడం, తేమ పేరుతో ధరలు తగ్గించడం, ఇతరత్రా సమస్యలు ఉన్నాయని ఆరోపణలు వినిపించినా అధికారులు మాత్రం ఇందుకు భిన్నంగా సమాధానమిస్తున్నారు. రైతులు సన్నాలు పండించడంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలపై ఆసక్తి చూపడం లేదని సమాధానమిస్తున్నారు. ఈ సీజన్‌లో మాత్రం నాగర్‌కర్నూల్ జిల్లాలో 234 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దాని ద్వారా 2,87,297 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు లక్ష్యం నిర్దేశించారు. 234 కొనుగోలు కేంద్రాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో 70, పీఏసీఎస్ 160, మెప్మా ఆధ్వర్యంలో 4 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

సన్నాలకు రూ.500 బోనస్

జిల్లాలో ఈ యాసంగిలో 1,53,164 ఎకరాల్లో వరిపంట సాగు చేయగా ఇందులో సన్నరకం 76,584 ఎకరాల్లో సాగు చేశారు. మొత్తంగా దీని ద్వారా 3.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అయితే 2.87 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వం క్వింటాల్ ఏ-గ్రేడ్ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధర ప్రకటించింది. దీంతోపాటు సన్న రకానికి బోనస్‌గా రూ.500 ఇవ్వనున్నారు. రైతులు ధాన్యం తీసుకువచ్చేటప్పుడు పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు ఖాతా, వీఆర్‌ఓ, ఏఈఓతో ధ్రువీకరణ పత్రం తేవాల్సి ఉంటుంది. కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి.. తర్వాత చెల్లింపులు చేస్తారు.

అందుబాటులో గన్నీ బ్యాగులు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో కావాల్సిన గన్నీ బ్యాగులను అధికారులు సమకూరుస్తున్నారు. ధాన్యం సేకరణకు మొత్తం 47 లక్షల గన్నీ బ్యాగులు అవసరం కాగా.. ప్రస్తుతం 26 లక్షల బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. ధాన్యం సేకరణ జరుగుతున్న సమయంలో అవసరాన్ని బట్టి మిగతా వాటిని తెప్పిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే వర్షం వచ్చినప్పుడు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు 4,670 అవసరం ఉండగా ప్రస్తుతం 2,600 అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

కొర్రీలు పెట్టొద్దు..



గతేడాది మాదిరిగా ఎలాంటి కొర్రీలు పెట్టకుండా ప్రభుత్వం ధాన్యం సేకరించాలి. ప్రభుత్వ ధర కంటే ప్రైవేట్ వ్యక్తులే గతేడాది అధిక ధరలకు కొనుగోలు చేశారు. తేమ శాతం, ధూళి పేరుతో గతేడాది సక్రమంగా కొనుగోలు చేయలేదు. ఈసారైనా ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా రైతులు పండించిన సన్నధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేయాలి. ప్రభుత్వం మద్దతు ధర మరింత పెంచాలి. – పెద్ద మశన్న, రైతు, గట్టురాయిపాకుల

రేపటి నుంచి ప్రారంభిస్తాం..

జిల్లాలో రైతుల నుంచి వరిధాన్యాన్ని సేకరించేందుకు 234 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. ప్రతి రైతు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి. ఈ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తాం. మంగళవారం నుంచి అన్నిచోట్ల కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి వస్తాయి. – శ్రీనివాస్, డీఎస్ఓ

1,075 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- పక్కా సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు
- ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగిన సోదాలు



రైస్ మిల్లులో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కల్వకుర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆకలి తీర్చాలని సంకల్పంతో రేషన్ షాపుల ద్వారా ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. అయితే సన్నబియ్యం సైతం పక్కదారి పట్టిన సంఘటన కల్వకుర్తి మండలంలో వెలుగు చూసింది. సన్నబియ్యంతోపాటు దొడ్డు బియ్యం నిల్వ ఉంచినట్లు పక్కా సమాచారం రావడంతో రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లా అధికారులు ఆదివారం మండలంలోని మార్చాల సమీపంలో ఉన్న శ్రీకృష్ణ రైస్ మిల్‌పై ఆకస్మికంగా దాడులు నిర్వహించగా.. 1,075 క్వింటాళ్ల బియ్యం పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. మిల్లర్లు ఇవి రేషన్ బియ్యం కావని చెప్పినప్పటికీ అధికారులు వారి మాటలను పట్టించుకోలేదు. మిల్లుకు నాలుగేళ్లుగా సీఎమ్మార్ వడ్లు ఇవ్వలేదని అధికారులు చెప్పారు. అయినా మిల్లులో ఎఫ్ఆర్‌కే బియ్యం దర్శనం ఇవ్వడంతో అవి రేషన్ బియ్యం అని అధికారులు తేల్చారు. ఈ బియ్యం ఎక్కడి నుంచి వచ్చాయో ఆరా తీసే పనిలో పడ్డారు.

రాత్రి 10 గంటల వరకు..

రైస్ మిల్లులో రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో అధికారులు మిల్లుకు చేరుకున్నారు. ఆ సమయంలో మిల్లు మూసి ఉండగా సంబంధిత యజమాని గుమాస్తాలతో మిల్లు తెరిపించారు. దీంతో ఏఎస్పీ వెంకటేశ్వర్లు టెక్నికల్ సిబ్బందితోపాటు జిల్లాలో పనిచేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు, డీఎం రాజేందర్‌ను మిల్లు వద్దకు రప్పించారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్విరామంగా సోదాలు నిర్వహించారు. మిల్లులో ఉన్న రేషన్ బియ్యాన్ని వివిధ వాహనాల ద్వారా వేరే మిల్లుకు తరలించారు. మిల్లు గుమాస్తాలను అదుపులోకి తీసుకున్నారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ వెంకటేశ్వర్లు చెప్పారు. మిల్లు యజమాని సంబురమణపై పోలీసులకు ఫిర్యాదు చేశామని డీఎం రాజేందర్ తెలిపారు.

నేటినుంచి అగ్నిమాపక వారోత్సవాలు



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో సోమవారం నుంచి 20 వరకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అగ్నిమాపక శాఖ అధికారి కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలో అదనపు కలెక్టర్ అమరేందర్ అగ్నిమాపక శాఖ వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు ప్రజలకు అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని చెప్పారు.

క్లుప్తంగా

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మహమ్మదాబాద్: కుటుంబంలో తనకంటూ ఎవరూ లేరని మనస్తాపానికి గురైన ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గండేడ్ మండలంలో శనివారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మండలంలోని జంగంరెడ్డిపల్లికి చెందిన కోస్గి ఆనంద్ (24) హైద్రాబాద్‌లోని కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. తనకంటూ ఎవరూ లేరని తరచూ బాధపడుతూ.. మద్యానికి బానిసయ్యాడు. శనివారం హైద్రాబాద్ నుంచి సొంతూరు జంగంరెడ్డిపల్లికి వచ్చాడు. పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. మృతుడి అక్క యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

బల్మూర్: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని జినుకుంట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. జినుకుంటకు చెందిన ధనుంజయ్ (30)తో పాటు మరికొందరు గ్రామ సమీపంలోని కేఎల్‌ఐ కాల్వలో విద్యుత్ వైర్లు కర్రకు చుట్టి చేపలు పడుతుండగా.. అతడు షాక్‌కు గురయ్యాడు. చికిత్స నిమిత్తం అచ్చంపేట ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రమాదేవి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో..

బల్మూర్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం బల్మూర్ మండలం కొండనాగులలో వెలుగు చూసింది. స్థానికుల వివరాల మేరకు.. కొండనాగులకు చెందిన ఎర్రం శ్రీను (50) భార్య ఊషమ్మ మూడు నెలలుగా తల్లిగారి ఊరైన బాణాలలో ఉంటుండగా.. ఎర్రం శ్రీను కుమారుడితో కలిసి గ్రామంలోనే ఉంటున్నాడు. ఆదివారం అతడు ఎంతకూ నిద్ర లేవక పోవడంతో అనుమానం వచ్చిన చుట్టుపక్కల వారు భార్య ఊషమ్మకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె కొండనాగులలోని ఇంటికి చేరుకుని చూడగా శ్రీను రక్తగాయాలతో కనిపించాడు. చికిత్స నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఊషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమాదేవి తెలిపారు. కాగా, మృతుడి కుమారుడు శనివారం రాత్రి తన తండ్రితో గొడవ పడినట్లు స్థానికులు తెలిపారు.

బాదేపల్లిలో వృద్ధురాలు..

జడ్చర్ల: అనుమానాస్పదంగా వృద్ధురాలు మృతిచెందిన ఘటన బాదేపల్లి పాతబజార్‌లో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ కమలాకర్ వివరాల మేరకు.. పాతబజార్‌కు చెందిన కాగుల అంజమ్మ (73) శనివారం రాత్రి తన చిన్న కుమారుడు నగేశ్ ఇంట్లో నిద్రించింది. ఆదివారం తెల్లవారుజామున ఇంటి ఎదుట రోడ్డుపై ఆమె శవమై కనిపించింది. అయితే ఇంట్లో పడుకున్న తన తల్లి బయట రోడ్డుపై మృతి చెందడంపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తంచేశారు. మృతురాలు నిద్ర మత్తులో బయటకు వెళ్లి ప్రమావశాత్తు కింద పడి మృతి చెందిందా.. మరేదయినా కారణాలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతురాలి కుమారుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


ఇరుకైన లోయలో కాలినడకన..


సలేశ్వరం లింగమయ్య దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు


సలేశ్వరం కొండల్లో భక్తులు

వెళ్లొస్తాం.. లింగమయ్యా

- ముగిసిన సలేశ్వరం బ్రహ్మోత్సవాలు
- మూడురోజుల్లో లింగమయ్య దర్శించుకున్న 2 లక్షల మంది భక్తులు
- ఫర్హాబాద్ చెక్‌పోస్టులు మూసివేత


చిన్న పిల్లలతో కలిసి..

జలపాతం వద్ద ఇలా..

అచ్చంపేట: నల్లమలలోని లోతట్టు ప్రాంతం సలేశ్వర క్షేత్రంలో వెలసిన లింగమయ్య ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. మూడు రోజులపాటు నల్లమల కొండలు జనసంద్రంతో కిక్కిరిసి కనిపించాయి. మూడు రోజుల సెలవు దినాలు రావడంతో సలేశ్వరం దర్శనం కోసం భక్తులు బారులుదీరారు. దట్టమైన అటవీ ప్రాంతంలో కొలువైన సలేశ్వరం క్షేత్రం దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాక ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహరాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. చివరిరోజు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి వాహనాలు అడవిలోకి వెళ్లకుండా అటవీశాఖ నిలిపివేసింది. ఈసారి పోలీస్, అటవీ శాఖలు సమన్వయంతో ఇచ్చిన మూడు రోజుల వ్యవధిలో 24 గంటలపాటు సలేశ్వరం దర్శనానికి అనుమతించడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదు. రాత్రివేళ ఎక్కువ మంది లింగమయ్య దర్శనం చేసుకోవడం ఎంతో అనుభూతి ఇచ్చింది. అయితే ప్రతిఏటా చైత్రశుద్ధ పౌర్ణమి సందర్భంగా వర్షం కురిసేది. దీంతో వాహనదారులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అయితే రెండేళ్లుగా ఎలాంటి వర్షం కురవకపోవడంతో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాలేదు. చివరిరోజు వస్తున్నాం.. లింగమయ్యా.. వెళ్లొస్తాం.. లింగమయ్యా అంటూ భక్తి పారవశ్యంలో మునిగితేలారు.

చెక్‌పోస్టుల మూసివేత

హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిలోని ఫర్హాబాద్, లింగాల మండలం అప్పాయిపల్లి ప్రాంతంలోని చెక్‌పోస్టులను అటవీశాఖ అధికారులు మూసివేశారు. ఈసారి అంచనాలకు మించి వాహనాలు రావడంతో ట్రాఫిక్ నియంత్రణలో పోలీస్, అటవీ శాఖలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు వాహనాల రద్దీ ఏమాత్రం తగ్గలేదు. శనివారం రాత్రి వాహనాలు భారీగా నిలిచిపోవడంతో టోల్‌చార్జీలు సైతం తీసుకోకుండానే లోపలికి అనుమతించారు. దీంతో ట్రాఫిక్ నియంత్రణ కొంత అదుపులోకి వచ్చింది. గతంలో మాదిరిగానే శ్రీశైలం వెళ్లే యాత్రికులకు మన్ననూర్ చెక్‌పోస్టును రాత్రి 9 గంటల వరకు అనుమతిస్తారు. సలేశ్వరం వెళ్లాలనుకునే భక్తులను మాత్రం అటవీ ప్రాంతంలోకి అనుమతించరు. అచ్చంపేట ఆర్టీసీ మొదటి రోజు 30, రెండో రోజు 36, మూడోజు16 ట్రిప్పుల చొప్పున బస్సులు నడిపించారు. అటవీ ప్రాంతంలో ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని చివరి రోజు ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకే బస్సులను నిలిపివేశారు.

పెరిగిన బందోబస్తు

గత ఉత్సవాల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పోలీస్, అటవీ శాఖలు సమన్వయంతో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అయితే అంచనాలకు మించి వాహనాలు, భక్తులు రావడంతో వారి సేవలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ముందస్తుగా అడవిలో చెత్త తొలగింపు, వాహనాలు, లోయ వద్ద భక్తుల రద్దీ నియంత్రణ, బారీకేడ్లు, భద్రత నిర్వహణను పోలీస్, అటవీ శాఖ సంయుక్తంగా చేపట్టింది. భక్తుల రద్దీకి అనుగుణంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఉత్సవాలు సజావుగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. గతంలో మాదిరిగా ఎలాంటి అపశ్రుతి చోటు చేసుకోలేదు.

స్వచ్ఛంద సంస్థలు, దాతల సేవలు..

స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఏర్పాటు చేసిన అన్నదానం, అంబలి కేంద్రాలు, తాగునీటి వసతి భక్తులకు ఎంతగానో ఉపకరించాయి. సలేశ్వరం ఉత్సవాలతో అటవీశాఖ ముక్కుపిండి టోల్ రుసుం వసూలు చేసింది. సలేశ్వరం ఉత్సవాలు మాత్రం అటవీ శాఖకు మంచి ఆదాయ వనరుగా నిలిచిపోయిందనే చర్చ సాగుతోంది. ప్రతిఏటా రూ.లక్షలాది ఆదాయం సమకూరుతున్న అటవీశాఖ సరైన ఏర్పాట్లు చేయలేకపోతోంది.


సహజ సిద్ధంగా వస్తున్న నీటిని పట్టుకుంటున్న మహిళ


సరదాగా సెల్ఫీ దిగుతూ..


కర్రల సాయంతో ముందుకు సాగుతూ..


పండ్లు పంపిణీ చేస్తున్న దాతలు

సహాయక చర్యలు వేగవంతం

మరో 10 రోజుల్లో శిథిలాల తొలగింపు పూర్తిచేసేందుకు ప్రయత్నాలు


సొరంగంలో చేపట్టిన మట్టి తొలగింపు పనులు

అచ్చంపేట: ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుల ఆచూకీ కోసం సహాయక చర్యలను ముమ్మరం చేశారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించి బయటకు తెచ్చేందుకు సహాయక సిబ్బంది విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదివారం సొరంగం ప్రమాద ప్రదేశం నుంచి పెద్ద పెద్ద బండరాళ్లను ఎస్కవేటర్ల సాయంతో విచ్ఛిన్నం చేసి లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలించారు. ప్రమాద ప్రదేశానికి చేరుకునేందుకు మార్గం ఏర్పాటు పనులను వేగవంతం చేశారు. సహాయక చర్యలు అత్యంత సమగ్రంగా, ప్రణాళికాబద్ధంగా కొనసాగుతున్నా యి. అయితే కన్వేయర్ బెల్టు తెగిపోతుండటంతో పనులకు ఆటంకంగా మారుతోంది. ఎప్పటికప్పుడు కన్వేయర్ బెల్టును పునరుద్ధరిస్తూ ఎస్కవేటర్ల సాయంతో మట్టిని బయటకు తరలిస్తున్నారు.

కొనసాగుతున్న బండరాళ్ల తొలగింపు..

నిర్దేశిత గడువులోగా సొరంగం ప్రమాద ప్రదేశంలో పనులు పూర్తిచేసేందుకు సహాయక బృందాలు శ్రమిస్తున్నాయని ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి అన్నారు. సొరంగం ఇన్‌లేట్ వద్ద జేపీ కార్యాలయంలో సహాయక బృందాల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సొరంగం లోపల చేపడుతున్న సహాయక చర్యలను ఉన్నతాధికారులు ప్రత్యేకాధికారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొరంగం లోపల కన్వేయర్ బెల్టు మరమ్మతు, వెంటిలేషన్ పొడిగింపు పనులతో పాటు మట్టి తవ్వకాలు చేపడుతున్నట్లు తెలిపారు. సొరంగం కూలిన ప్రదేశం నుంచి ఉబ్బికి వస్తున్న నీటి ఊటను ఎప్పటికప్పుడు బారీ మోటార్ల సాయంతో బయటకు పంపింగ్ చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, జేపీ కంపెనీ సీనియర్ ప్రాజెక్టు ఇంజినీర్ సంజయ్‌కుమార్ సింగ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్ తదితరులు ఉన్నారు.

నిపుణుల సూచనల మేరకు..

సొరంగంలో నిపుణులు, అనుభవజ్ఞులైన వారి సూచనలు, సలహాల మేరకు సహాయక చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందినశాస్త్రవేత్తలు, నీటిపారుదల నిపుణులు, సొరంగం నిర్మాణంలో అనుభవం కలిగిన ఇంజినీర్లతో పాటు సంబంధిత శాఖల నిపుణుల సూచనలు, సలహాలు అనుసరించి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. సొరంగంలో వాతావరణం, మట్టి నిల్వలు, నీటి ప్రవాహం తదితర అంశాలపై నిత్యం పరిశీలనలు చేపడుతూ.. వీటి ఆధారంగా తదుపరి చర్యలు వేగవంతం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ చాంపియన్ విశాఖపట్నం

- రన్నరప్‌గా నిలిచిన నెల్లూరు జట్టు
- ముగిసిన ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్


విన్నర్ విశాఖపట్నం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎన్పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహించిన ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా విశాఖపట్నం జట్టు నిలిచింది. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ నిర్వహించిన ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆదివారం ఉత్సాహంగా ముగిసింది. ఈ టోర్నీలో నాలుగు జట్లు పాల్గొనగా రాబిన్ రౌండ్ లీగ్ పద్ధతిలో ఆరు మ్యాచ్‌లు నిర్వహించారు. విశాఖపట్నం జట్టు వరుసగా మూడు మ్యాచ్‌లు గెలుపొంది 9 పాయింట్లు సాధించి విన్నర్‌గా, నెల్లూర్ జట్టు రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించి 6 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచింది. ఆతిథ్య మహబూబ్‌నగర్ జట్టు 3 పాయింట్లు దక్కించుకొని తృతీయస్థానంలో నిలిచింది. అంతకుముందు జరిగిన లీగ్ మ్యాచుల్లో మహబూబ్‌నగర్ జట్టు 2-0 గోల్స్ తేడాతో ఏపీ స్పోర్ట్స్ స్కూల్ పూర్వ విద్యార్థుల జట్టుపై, విశాఖపట్నం జట్టు 1-0 గోల్ తేడాతో నెల్లూర్ జట్లపై విజయాలు నమోదు చేసుకున్నాయి.

ట్రోఫీలు అందజేసిన ఎన్పీ వెంకటేశ్

ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో విన్నర్ విశాఖపట్నం జట్టు, రన్నరప్ నెల్లూర్ జట్లకు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్పీ.వెంకటేశ్ ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇన్విటేషన్ టోర్నమెంట్‌లో నాలుగు జట్లు పాల్గొని తమ ప్రతిభచాటడం అభినందనీయమని అన్నారు. ఈ వయస్సులో కూడా సీనియర్ క్రీడాకారులు ఫుట్‌బాల్ ఆటపై తమనకున్న అభిమానంతో ఇన్విటేషన్ టోర్నమెంట్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షులు టీఎస్.రంగారావు, శంకర్‌లింగం, ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇమ్మాన్యుయెల్ జేమ్స్, గజానంద్‌కుమార్, నందకిషోర్, రామేశ్వర్, నగేశ్, రామకృష్ణ పాల్గొన్నారు.



బాలికపై అత్యాచారయత్నం?

మహబూబ్‌నగర్ రూరల్: హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బయల్దేరిన బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి యత్నించిన ఘటన మహబూబ్‌నగర్ మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులకు ఇద్దరు కూమార్తెలు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం పెద్ద కుమార్తెను ఇదే మండలంలోని గ్రామానికి చెందిన యువకుడికి ఇచ్చి వివాహం జరిపించారు. అనంతరం దంపతులిద్దరూ జీవనోపాధి నిమిత్తం చిన్నకుమార్తెతో కలిసి హైదరాబాద్‌కు వలస వెళ్లారు. ఇదిలా ఉంటే, ప్రస్తుతం కోయిల్‌కొండ మండల కేంద్రంలో వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. తమ ఇంటి దేవుడు అయిన వీరభద్రస్వామి ఉత్సవాల్లో పాల్గొనేందుకు తమ చిన్న కుమార్తెను హైదరాబాద్ నుంచి ఒంటరిగా స్వగ్రామానికి పంపించారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్‌కు చేరుకున్న సదరు బాలిక.. ఇక్కడి నుంచి ఊమండలానికి చెందిన యువకుడి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా.. బొక్కలోనిపల్లి గ్రామం దాటిన తర్వాత బంగారు మైసమ్మ ఆలయ సమీపంలోని గుట్టల్లోకి తీసుకెళ్లి బాలికపై అత్యాచారానికి యత్నించినట్లు తెలుస్తోంది. బాలిక అతడి నుంచి తప్పించుకొని రోడ్డుపైకి పరిగెత్తుకుంటూ వచ్చి స్పృహతప్పి పడిపోయింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా.. ఘటనా స్థలంలో ఇంజక్షన్లు ఉన్నట్లు తెలుస్తోంది. బాలికకు మత్తమందు ఏదైనా ఇచ్చి అఘాయిత్యానికి యత్నించారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా.. పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

ఉమ్మడి పాలమూరుపై ఎందుకీ వివక్ష

- నీటి ప్రాజెక్టులపై పాలకుల దోపిడీ విధానాన్ని ఎండగడుదాం
- పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి


మాట్లాడుతున్న రాఘవాచారి

అచ్చంపేట రూరల్: ఉమ్మడి పాలమూరు జిల్లా నీటి ప్రాజెక్టులపై పాలకుల దోపిడీ విధానం కొనసాగుతోందని, ఇక్కడి రైతాంగ భూములను నిండా ముంచి నల్లగొండ జిల్లాకు నీరు తరలించుకుపోతున్నారని.. ప్రతి ఒక్కరూ ఎండగట్టాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి పిలుపునిచ్చారు. ఆదివారం అచ్చంపేటలో జల వనరుల సాధన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవాచారి మాట్లాడుతూ.. పాలకుల స్వార్థ బుద్ధి, మన ప్రాంత ప్రజాప్రతినిధుల బాధ్యతారాహిత్యం వలన దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లా అనేక విధాలా నష్టపోతుందన్నారు. జిల్లా జల వనరుల సమస్యలపై ఇతర సమస్యలు తెలియజేస్తూ జిల్లా వాసి అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ అందజేయగా.. ఒక్కసామస్య పరిష్కరించలేదన్నారు. పోరాడి సాధించుకున్న పీఆర్‌ఎస్‌ఐ పథకం నీళ్లు నల్లగొండ జిల్లాకు తరలించుకుపోవడానికి ఆగమేఘాల మీద క్యాబినెట్ ఏర్పాటు, తీర్మానం చేసి, జనవరి 22న ఏకంగా జీవో 11 విడుదల చేశారన్నారు. ఏదుల నుంచి సొరంగం ద్వారా నీటిని బయటికి తీసి మన జిల్లా రైతాంగ భూములను ముంచి నల్లగొండ జిల్లాకు నీరు తరలించుకుపోవడానికి యుద్ధ ప్రాతిపదికన సన్నాహాలు చేస్తున్నారని ఆరోపించారు.

ప్రతి ఒక్కరూ సంఘటితమవ్వాలి

ఇలాంటి కుట్రలు, అన్యాయాన్ని, జల దోపిడీని అడిగి నిలదీసే స్థానిక ప్రజాప్రతినిధులు లేకుండా పోయారని, నల్లగొండ జిల్లాకు నీళ్ల తరలింపు కోసం పెడుతున్న శ్రద్ధ మన ఎత్తిపోతల పథకాలపై ఎందుకుండటం లేదన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల జాతరలో ఉమామహేశ్వర చెన్నకేశవ రిజర్వాయర్లు నిర్మిస్తామని, అమ్రాబాద్ ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని వాగ్దానం చేసి సరైన విధానం ఏది లేక ప్రజలను గందరగోళంలో ముంచి చేతులెత్తేసిందన్నారు. అమ్రాబాద్ ఎత్తిపోతల కోసం ఉమామహేశ్వర బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించ తలపెట్టిన ప్రాంత గ్రామాల రైతులు తమ భూములు పూర్తిగా మునిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. జలవనరుల సాధన కోసం ప్రతి ఒక్కరూ సంఘటితమవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, రామస్వామి, గోపాల్, వెంకటేష్, బాలస్వామి, నారాయణ, నాగయ్య, ఇంద్రారెడ్డి, సీతారాంరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

- ప్రైవేట్ మినీ బ్యాంకులలో పనిచేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. స్థలం క్లాక్ టవర్, హనుమాన్ నగర్ మహబూబ్‌నగర్ జిల్లా. సెల్: 9704013331, 0870-3569177.
- Wanted Female Hostel Incharges in Reputed Educational Organisation Qualification Any Inter/ Degree, Age Limit: 25 to 45 years, Salary upto: 15000/- (plus Food and Accommodation), Working Location: Dilshuknagar. Contact: 9248733346, 9248733362
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ:18k Ph: 9640400073, 9160900024
- ఫామ్ హౌస్‌లో పనిచేయుటకు వ్యవసాయం తెలిసిన భార్యాభర్తలు కావలెను. రూమ్ ఇవ్వబడును. కల్వకుర్తి గట్టు ఇప్పలపల్లి నెలకు జీతం 15వేలు. 7382532031

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాం. ప్రకటనదారు చెప్పే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు. - సాక్షి మేనేజర్





